"స్వామీ! నేను కోరిందల్లా దేవుడు తీరుస్తున్నాడు. నా మిత్రుడు రాజు ఒక్క కోరికా కోరడు. మా ఇద్దరిలో ఎవరు అధికం అన్న మీమాంస నన్ను చాలాకాలంగా పీడిస్తోంది. మీరు తేల్చి చెప్పండి." రాముడు అడిగాడు.

"మీ ఇద్దరూ ఎక్కువ, తక్కువ తేడాల్లేకుండా సమాన స్థాయివారు. కాకపోతే కోరిక ఉండి అది తీరేవాడికన్నా, అసలే కోరికా లేనివాడు నిజంగా ధన్యుడు." జవాబు చెప్పాడా జ్ఞాని.

## 196. భగవంతుడు ఎవరు?

"భగవంతుడంటే ఎవరు?" అడిగాడు ఒకడు ఓ తత్త్వవేత్తని.

ఆ తాత్త్వికుడు బదులు చెప్పలేదు.

"భగవంతుడంటే ఎవరు స్వామీ?" మళ్ళీ అడిగాడతను.

ఈసారీ బదులు చెప్పలేదా తాత్త్వికుడు.

మూడోసారి అతనడిగాక జవాబు చెప్పాడాయన.

"నీ ప్రశ్నలకి జవాబు చెప్పినా మళ్ళీ అదే ప్రశ్న వేస్తావే? మౌనమే భగవంతుడు."

## 197. సజ్జనుడు

"నాయనా నువ్వు ధర్మ ప్రవచనం చేస్తున్న సమయంలో ఎవరైనా తిడితే ఏం చేస్తావు?"

"కొట్టనందుకు సంతోషిస్తాను."

"కొట్టారనుకో."

"చంపనందుకు సంతోషిస్తాను."

"ఒకవేళ చంపితే?"

"ఓ ధర్మ కార్య నిర్వహణలో ప్రాణం పోయినా ఫర్వాలేదు."

ఇలాంటివారే ధర్మ ప్రచారానికి తిరుగులేని మనుషులు.